క్లుప్తంగా

గురు చరిత్ర పారాయణం ప్రారంభం


ప్రవచనాలు చేస్తున్న అర్చకులు

చెన్నూర్: పట్టణంలోని శివాలయంలో లోక కళ్యాణార్థం బుధవారం గురు చరిత్ర పారాయణాన్ని అర్చకులు వేమారం మహేశ్వర్ శర్మ ప్రారంభించారు. పారాయణ ప్రవచనలకు పెద్ద సంఖ్యలో మహిళలు హాజరయ్యారు. ఏటా శివాలయంలో గురుచరిత్ర పారాయణ ప్రవచనాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పారాయణం ఈ నెల 26 మంగళవారం ముగుస్తుందన్నారు. 27న బుధవారం 10గంటలకు వ్యాస పూజ, మధ్యాహ్నం 1గంటలకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గురు చరణ్ శర్మ పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లు సద్వినియోగం చేసుకోవాలి

దండేపల్లి: మండలంలోని కన్నెపల్లి సమీపంలోని శ్రీ వెంకటేశ్వర జిన్నింగ్ మిల్లులో సీసీఐ ద్వారా చేపడుతున్న పత్తి కొనుగోళ్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొద్ది రోజులుగా పత్తి కొనుగోళ్లు నిలిచిపోయి, రైతులు ఇబ్బంది పడటంతో, సీసీఐ సీపీవో ఉదయ్‌షాతో మాట్లాడి, పత్తి కొనుగోళ్లు చేపట్టాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. గురువారం నుంచి కొనుగోళ్లు ప్రారంభమవుతాయని చెప్పారు.

కస్తూర్బాలో విజ్ఞాన ప్రయోగశాల


ప్రదర్శన చేస్తున్న ఉపాధ్యాయులు

జన్నారం: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో డీఈఓ యాదయ్య ఆదేశాల మేరకు సైన్స్ అధికారి మధుబాబు పర్యవేక్షణలో బుధవారం విద్యార్థులకు విజ్ఞాన ప్రయోగశాల నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రసాయన శాస్త్ర ప్రయోగాలు, మానవ శరీర అంతర్గత అవయవాల పనితీరు విద్యార్థులకు వివరించారు. కేజీబీవీ ప్రత్యేక అధికారిని వాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కూపర్ లింగుస్వామికి పూజలు


ఊరేగింపుగా వెళ్తున్న ఆదివాసీలు

కాసిపేట: మండలంలోని వెంకటాపూర్ గ్రామ పంచాయతీ కుర్రేగాడ్ గ్రామంలో బుధవారం నుంచి శ్రీశ్రీపాహుండి కూపర్ లింగుస్వామి, భీమన్న దేవుడి సట్టి పూజలు ప్రారంభమయ్యాయి. ఈ పూజలు నాలుగు రోజుల పాటు కొనసాగుతాయని పూజారులు తెలిపారు. ఆదివాసీ సంస్కృతి, వాయిద్యాలతో దేవుడిని ఊరేగించి సాయంత్రం పూజ చేసి కాలినడకన గంగకు బయలుదేరుతారు. అక్కడ స్నానం చేసి సంప్రదాయాలతో పూజలు చేసి తిరిగి ఇంటికి చేరుకొని భీమన్న దేవుడికి పూజలు చేస్తారు. కార్యక్రమాల్లో గ్రామస్తులు కుర్సింగ భూదేవ్‌స్వామి, మాదవ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి


ధాన్యం పరిశీలిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీలు

నెన్నెల: ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ శ్యామలదేవి డిమాండ్ చేశారు. మండలంలోని మన్నెగూడం రైతులను బుధవారం కలిశారు. వారం రోజులుగా వరి కోతలు జరుగుతున్నా, ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదన్నారు. వాతావరణ మార్పులతో రైతులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారన్నారు. రైతులకు గోనె సంచులను అందజేసి, ప్రభుత్వమే రైతుల కళ్లాల వద్దకు వచ్చి ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మేకల మల్లేష్, ఎంపీటీసీ తిరుపతి, బీఆర్‌ఎస్ నాయకులు ప్రతాప్‌రెడ్డి, సింగతి రాంచందర్ పాల్గొన్నారు.

గతమెంతో ఘనం..!

- లక్సెట్టిపేట ప్రభుత్వ బడికి ఘనమైన చరిత్ర
- ఉన్నతాధికారులు, నేతలుగా ఎదిగిన పూర్వ విద్యార్థులు
- కొన్నేళ్లుగా ఆదరణ లేక పాత గదుల్లోనే తరగతులు
- కళాశాలగా అప్‌గ్రేడ్ అయినా మారని పరిస్థితి
- ఇటీవల అగ్నికి ఆహుతైన పాఠశాల గదులు


ఈ నెల 17వ తేదీన అగ్నిప్రమాదంలో కాలిపోతున్న పాఠశాల

లక్సెట్టిపేట: ఎంతోమంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్ది ఉన్నత హోదాలో ఉండేలా చేసిన పాఠశాలకు ఆదరణ కరువైంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చి చదువుకుని ఉద్యోగాలు సాధించిన వారు కూడా పాఠశాలను మరిచిపోయారు. గతంలో ఇక్కడ అడ్మిషన్ పొందాలంటే ఇంతో ఇబ్బంది పడేవారు. ఆదిలాబాద్, జన్నారం, ధర్మపురి, చెన్నూర్ ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చి విద్యాభ్యాసం చేశారు. పాఠశాల నుంచి కళాశాలగా అప్‌గ్రేడ్ అయి సంవత్సరాలు గడిచినా, ఎవరూ పట్టించుకోలేదు. 'మనఊరు–మనబడి' పథకంలో పాఠశాలపై చిన్న చూపు చూడడంతో పక్కా భవనానికి నోచుకోక ఆదరణ కరువైంది. ఇటీవల అగ్ని ప్రమాదంలో కాలిపోతున్న పాఠశాలను చూసిన పట్టణవాసులు కంటనీరు తెచ్చుకున్నారు. సుమారు రూ.ఐదు నుంచి రూ.పది లక్షల ఆస్తినష్టం వాటిల్లింది.

పాఠశాల ఇలా ఏర్పడింది..



1960వ సంవత్సరంలో పాఠశాల ఏర్పడింది. 1969లో పదో తరగతితో పాటు ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు కూడా ఇక్కడే 1973వ సంవత్సరంలో పదో తరగతి విద్యాభ్యాసం చేశారు. చాలా మంది మేధావులు, రాజకీయ నాయకులు ఉద్యోగస్తులు ఇక్కడ విద్యాభ్యాసం చేసిన వారే. ప్రభుత్వాలు మారినా పాఠశాల మాత్రం అలాగే మిగిలిపోయింది.

ఇక్కడే పదో తరగతి చదువుకున్నా..



1973వ సంవత్సరంలో ఇక్కడ పదో తరగతి చదువుకున్నాను. అప్పటి నుంచి ఇప్పటి వరకు పాఠశాలపై ప్రభుత్వాలు దృష్టి పెట్టలేదు. పట్టణంలో మొట్టమొదటి పాఠశాల కావడం, అప్పటి కాలంలో చాలా మంది విద్యార్థులు ఇక్కడ చదువుకుని మంచి హోదాలో ఉన్నారు. పది సంవత్సరాల పాలనలో పాఠశాలపై ప్రభుత్వం దృష్టిపెట్టలేదు. పక్కా భవనానికి కృషి చేస్తాను.

- కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు, ఎమ్మెల్యే

చాలా ఇబ్బందిగా ఉంటుంది



పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. చాలా ఏళ్లుగా శిథిలావస్థలో ఉన్న పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్నారు. అదనపు గదులు నిర్మించినా సరిపోవడం లేదు. అగ్నిప్రమాదానికి గురికావడంతో ఇంకా చాలా ఇబ్బంది అవుతోంది. ప్రభుత్వం, అధికారులు పట్టించుకుని ఇప్పటికైనా పక్కా భవనాన్ని నిర్మించి, విద్యావ్యవస్థను అభివృద్ధి చేయాలని కోరుతున్నాం.

- వేణుగోపాల్, ప్రధానోపాధ్యాయులు

శిథిలావస్థలో గదులు..

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల శిథిలావస్థకు చేరుకుని ఏళ్లు గడిచినా అందులోనే విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం ఉన్నత పాఠశాల, మధ్యాహ్నం కళాశాల నిర్వహించి తరగతులు కొనసాగించారు. కొద్ది రోజుల తరువాత అదనపు గదులు నిర్మించినా సరిపోకపోవడంతో పాత గదుల్లోనే తరగతులు, ల్యాబ్‌లు నిర్వహిస్తున్నారు. అదనపు గదుల భవనంలో ఆకతాయిలు రాత్రి వేళల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. ప్రస్తుతం పాఠశాలలో 140మంది. ఇటర్మీడియట్‌లో 250మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈ నెల 17వ తేదీన అకస్మాత్తుగా అగ్నిప్రమాదం జరగడంతో విద్యార్థులకు తరగతి గదులు సరిపోక ఆరుబయటనే విద్యాభ్యాసం చేస్తున్నారు. మధ్యాహ్న భోజనానికి వంటగది లేకపోవడంతో చెట్ల కింద వంట చేస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకుని పురాతన పాఠశాల భవనానికి పూర్వ వైభవం తెప్పించేలా చర్యలు తీసుకుని ఆధునిక పద్ధతుల్లో పక్కా భవనాన్ని నిర్మించి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.


ఆరుబయట వంట చేస్తున్న సిబ్బంది

ఘనంగా సీపీఐ వార్షికోత్సవం


జెండా ఆవిష్కరిస్తున్న లక్ష్మణ్

రామకృష్ణాపూర్: సీపీఐ పార్టీ 99వ వార్షికోత్సవ వేడుకలను బుధవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం అనేక ఉద్యమాలు సాగించి, వారికి అనేక హక్కులు సాధించి పెట్టిన ఘనత సీపీఐ పార్టీకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి మిట్టపెల్లి శ్రీనివాస్, పౌల్, నక్క వెంకటస్వామి, వనం సత్యం, రవి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న సర్పంచ్‌తో ఎంపీపీ, ఎంపీడీవో తదితరులు

దండేపల్లి: మండలంలోని మామిడిపల్లి సర్పంచ్ ఎల్లపు శ్రీనివాస్ గతేడాది క్రితం పలు కారణాలతో సస్పెండ్ అయ్యాడు. దీంతో అతడిపై విచారణ జరిపిన అధికా రులు, అతడికి తిరిగి మళ్లీ బాధ్యతలు అ ప్పగిస్తూ నియామకపత్రం అందించారు. దీంతో అతడు బుధవారం తిరిగి మళ్లీ విధుల్లో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, జెడ్పీటీసీ నాగరాణి, ఎంపీడీవో మల్లేశం, ఎంపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

- జిల్లా విద్యాధికారి యాదయ్య


వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న డీఈవో

జన్నారం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని, క్రీడలతో మానసిక ఉల్లాసం వస్తుందని జిల్లా విద్యాధికారి యాదయ్య పేర్కొన్నారు. మండలంలోని కలమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం మండలస్థాయి వాలీబాల్, టెన్నీకాయిట్ పోటీల సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరై పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీఈవో మాట్లాడుతూ.. క్రీడల ద్వారా స్నేహభావం పెరుగుతుందని, అపజయం, జయాలు పొందడం వల్ల జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవడం నేర్పుతుందన్నారు. క్రీడలతో శరీర ధృఢత్వం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి విజయ్‌కుమార్, పీఆర్టీయూ మాస పత్రిక సంపాదకులు తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి, పాఠశాల హెచ్‌ఎం కట్ట రాజమౌళి, సెక్టోరల్ అధికారి చౌదరి, ఉప సర్పంచ్ రాజన్న, కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజేందర్, వార్డు సభ్యుడు దయాకర్, గోపాల్, సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కమలాకర్, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాళ్లపేట ఉన్నత పాఠశాలలో కేబినెట్ ఎన్నికలు


ఓటేసేందుకు విద్యార్థుల క్యూ..

దండేపల్లి: పాఠశాల నిర్వహణలో విద్యార్థులను భాగస్వామ్యం చేసేందుకు విద్యార్థి నాయకులను ఎన్నుకునేందుకు దండేపల్లి మండలం తాళ్లపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం కేబినెట్ ఎన్నికలు నిర్వహించారు. విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కల్పించడం కోసం, ఈ ఎన్నికల నిర్వహణను నిజమైన ఎన్నికను తలపించేలా నిర్వహించారు. పాఠశాల విద్యార్థి నాయకుడు, క్రీడలు, సాంస్కృతిక, నీటిసరఫరా, క్రమశిక్షణ, మధ్యాహ్న భోజన పథకం, సమాచారశాఖ వంటి శాఖల్లో విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ, అందుకు సంబంధించిన విద్యార్థి నాయకులను విద్యార్థులు ఓటు ద్వారా ఎన్నుకున్నారు. నాయకులుగా 9, 10విద్యార్థులను ఎన్నుకోగా, మిగితా తరగతులు వారు ఓటర్లుగా, ఓటు ద్వారా విద్యార్థి నాయకులను ఎన్నుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పిరంగి సుదర్శన్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి మండలపూజ

మంచిర్యాలఅర్బన్: పాత మంచిర్యాల రామాలయం, శివాలయంలో బుధవారం అయ్యప్పస్వామి మండలపూజ వైభవంగా జరిగింది. భక్తి పాటలు అలరించాయి. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, మున్సిపల్ చైర్మన్ రాజయ్య, ఆలయ కమిటీ డైరెక్టర్ రవీందర్, స్వాములు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు భిక్ష

జన్నారం: మండల కేంద్రంలో అయ్యప్ప స్వాములకు ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి సోహెల్ ఆధ్వర్యంలో భిక్ష ఏర్పాటు చేసి మతసామరస్యాన్ని చాటారు. మండలంలోని అయ్యప్ప స్వాములకు స్వయంగా భిక్ష వడ్డించి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. పలువురు అయ్యప్పస్వాములు ఎన్‌ఎస్‌యూఐ కార్యకర్తలను అభినందించారు.


పూజ నిర్వహిస్తున్న గురుస్వాములు

లక్సెట్టిపేట: స్థానిక ప్రభుత్వ కళాశాల మైదానంలో అయ్యప్ప పడిపూజ ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని తిలకించారు. గురుస్వాములు చక్రవర్తుల పురుషోత్తమాచార్యులు హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో 25మంది గురుస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

'ఇచ్చిన ప్రతీ హామీని నిలబెట్టుకుంటాం'


వంశీకృష్ణకు వినతిపత్రం ఇస్తున్న రాజశేఖర్ రెడ్డి

రామకృష్ణాపూర్: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతీ హామీని కాంగ్రెస్ నిలబెట్టుకుంటుందని ముఖ్యంగా ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుందని ఆ పార్టీ నాయకుడు చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తనయుడు వంశీకృష్ణ అన్నారు. రామకృష్ణాపూర్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్ట్ ఉద్యోగాల్లో స్థానికులకే అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రికి విన్నవించినట్లు తెలిపారు.

'ఎలకేశ్వరంకు బీటీ రోడ్డు నిర్మించాలి'

భీమారం: మండలంలోని ఎలక్వేరం గ్రామానికి బీటీ రోడ్డు నిర్మించాలని వంశీకృష్ణకు మండల కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రోడ్డు లేక పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గ్రామానికి బస్సు నడపాలని కోరారు.

రోడ్డు కోసం ఎన్‌హెచ్‌ఏ అధికారులకు విన్నపం



అధికారితో మాట్లాడుతున్న ప్రభాకర్

బెల్లంపల్లి: జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేకంగా సర్వీసు రోడ్డును, మురికి నీటి కాలువలను నిర్మించాలని మున్సిపల్ వార్డు కౌన్సిలర్ బి.ప్రభాకర్, నాయకులు ఎన్‌హెచ్‌ఓ అధికారులను కోరారు. బుధవారం మంచిర్యాలలోని ఎన్‌హెచ్‌ఓ కార్యాలయానికి వెళ్లి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల గురించి నాయకులు వివరించారు. కన్నాల పంచముఖ హన్మాన్ విగ్రహం వద్ద నుంచి ప్రభుత్వాసుపత్రి వరకు సర్వీసు రోడ్డు లేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని తెలిపారు. జాతీయ రహదారిని ఇరువైపులా ప్రత్యేకంగా సర్వీసు రోడ్డును, మురికి నీటి కాలువలను నిర్మించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సానుకూలంగా స్పందించిన అధికారులు సర్వే చేయించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో కాంగ్రెస్, సీపీఐ నాయకులు చంద్రయ్య, అఖిల్, జీసీ మాణిక్యం, స్థానికులు ఉన్నారు.

ఆటలతో పోటీతత్వం పెరుగుతుంది



- జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: ఆటల్లో గెలుపోటములు సహజమని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. ప్రగతి మైదానంలోని సీఈఆర్ క్లబ్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరై శ్రీరాంపూర్ ఏరియా డబ్ల్యూపీఎస్, జీఏ వార్షిక క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు బుధవారం బహుమతి ప్రదానం చేశారు. సింగరేణిలో ఎంతో ప్రావీణ్యం ఉన్న క్రీడాకారులు ఉన్నారన్నారు. కంపెనీ స్థాయిలోనే కాకుండా కోలిండియా స్థాయిలో కూడా రాణించాలన్నారు. కంపెనీ క్రీడలకు, క్రీడాకారులకు అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏరియా ఓస్‌టుజీఎం రఘుకుమార్, డీజీఎం(పర్సనల్) అరవింద రావు, ఓసీపీ ప్రాజెక్టు అధికారి పురుషోత్తంరెడ్డి, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు అబ్దుల్ ఖాదీర్, స్పోర్ట్స్ గౌరవ కార్యదర్శి పాలకుర్తి రాజు, సూపర్‌వైజర్ చాట్ల అశోక్, కోఆర్డినేటర్ తోట సురేశ్, జనరల్ కెప్టెన్ గోపాల్ పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

లేడీస్ క్లబ్ మెంబర్స్‌కు ఆటల పోటీలు


త్రోబాల్ పోటీలు ప్రారంభిస్తున్న సవిత మనోహర్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని ఇల్లందు క్లబ్ ఆవరణలో బుధవారం సింగరేణి లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. ఈ ఆటల పోటీలను లేడీస్ క్లబ్, సేవా సమితి ఏరియా అధ్యక్షురాలు, జీఎం సతీమణి సవిత మనోహర్ హాజరై ప్రారంభించారు. త్రో బాల్, బాల్ ఇన్ బాస్కెట్, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించగా మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన మహిళలకు సింగరేణి డే రోజున బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

'మేనిఫెస్టోను అమలు చేస్తాం'

శ్రీరాంపూర్: ఎన్నికల్లో తాము విడుదల చేసిన మేనిఫెస్టోను గెలిచిన తర్వాత నూరు శాతం అమలు చేస్తామని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు తెలిపారు. ఎస్ఆర్పీ 3, 3ఏ, ఆర్కే 5గనిపై బుధవారం ఆయన గనులపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. కార్మికుల సొంతింటి కల నెరవేర్చుతామన్నారు. మహిళా ఉద్యోగులకు కూడా ప్రతినెలా రెండు ప్రత్యేక సెలవులను ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి తిరుపతి రాజు, డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు గరిగే స్వామి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కార్మికులు టీబీజీకేఎస్‌నే గెలిపించాలి'

కాసిపేట: సింగరేణిలో కారుణ్య నియామకాలు ద్వారా కొత్త రక్తాన్ని నింపింది టీబీజీకేఎస్ యూనియన్ అని మందమర్రి ఏరియా మాజీ వైస్ ప్రెసిడెంట్ రవీందర్ అన్నారు. కాసిపేట–2గనిపై బుధవారం గేట్ మీటింగ్ నిర్వహించి మాట్లాడారు. సింగరేణి వారసుల వారసత్వ ఉద్యోగాలు పోగొట్టిన జాతీయ సంఘాలు ఈ రోజున ఏ ముఖం పెట్టుకొని కార్మికులను ఓటు అడగడానికి వస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ఈ వారసత్వం ద్వారానే నేడు యువ కార్మికులు కనపడుతుందన్నారు. టీబీజీకేఎస్‌ను గెలిపించాలని కార్మి కులను కోరారు. కార్యక్రమంలో పిట్ కార్యదర్శి తిరుపతి, ఏరియా నాయకులు మాదవరెడ్డి, ఈశ్వర్, పోలు సంపత్, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి సారంగపాణి, వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ సెగ్యం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యాసంగి సాగుపై అవగాహన

చెన్నూర్‌రూరల్: మండలంలోని కొమ్మెరలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సహాయ వ్యవసాయశాఖ సంచాలకులు జాడి బాపు రైతులకు యాసంగి పంటల సాగుపై అవగాహన కల్పించారు. సేంద్రియ వ్యవసాయ ప్రాముఖ్యతపై వివరించారు.

మండల కమిటీ ఎన్నిక

దండేపల్లి: బీజేపీ మహిళా మోర్చ మండల కమిటీని బుధవారం ఎన్నుకున్నట్లు పార్టీ మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు జోగుల శ్రీదేవి, పార్టీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య తెలిపారు. మండల అధ్యక్షురాలిగా అక్కల దివ్య, ప్రధాన కార్యదర్శిగా చిట్ల మంజుబార్గవి, ఉపాధ్యక్షురాలిగా శకుంతల, భాగ్య, లక్ష్మి, సౌమ్య, కార్యదర్శిగా శంకరమ్మను ఎన్నుకున్నారు. జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు సుగుణ, పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

గిరిజన, పేద విద్యార్థులకు చేయూతగా..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం పెద్దంపేటలోని కొలాంగూడ, పెద్దంపేట గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న గిరిజన, నిరుపేద విద్యార్థులకు బుధవారం మాధవ సేవా సమితి–చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేయూతగా నిలిచారు. విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, ఇతర స్టేషనరీ అందజేసి ఉన్నతంగా చదువుకోవాలని మార్గదర్శనం చేశారు. కార్యక్రమంలో మాధవ సేవా సమితి కార్యదర్శి మిట్టపల్లి రవీందర్‌రెడ్డి, కోశాధికారి రేవెల్లి బాపూజీ, సభ్యులు పెంట శ్రీనివాస్, చందాకిరణ్‌కుమార్, నగర కార్యవాహ పర్వతాల నర్సయ్య, స్థానిక నాయకుడు పొట్టాల శ్రీశైలంగౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

చిన్నారులకు అక్షరభ్యాసం

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని అర్కలవాడ అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం ఐదు నెలలు నిండిన గర్భిణులకు సీమంతాలు, ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన, మూడేళ్లు నిండిన చిన్నారులకు అక్షరభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమ, ఏఎన్‌ఎం సరిత, జ్యోతి, ఆర్పీలు జ్యోతి, సునిత, అంగన్‌వాడీ టీచర్ సురేఖ, ఆయమ్మలు, గౌరీ, స్రవంతి పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

మంచిర్యాలటౌన్: స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని రోగులకు బుధవారం హెల్ప్ సొసైటీ ఆధ్వర్యంలో పండ్లను పంపిణీ చేశారు.

ఆర్థిక సాయం

దండేపల్లి: మండలంలోని మామిడిపల్లికి చెందిన నిరుపేద యువతి నిర్మల వివాహానికి ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు రూ.5వేల ఆర్థిక సాయాన్ని పంపించగా, స్థానిక కాంగ్రెస్ నాయకులు బుధవారం యువతికి అందించారు. త్రిమూర్తి, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.